నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 27 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD





### ❖ నా భర్త కూలిపని చేసేందుకు కానిస్టేబులవ్వలేదు..

ప్రజలకు సేవ చేయడానికి నా భర్త కానిస్టేబుల్ ఉద్యోగం తెచ్చుకున్నారు. పెద్దసార్లకు కాఫీలు తెచ్చి ఇవ్వడానికో, కూలిపని చేయడానికో ఉద్యోగంలో చేరలేదు. మా పిల్లలను చూడడానికి కనీసం నెలకు ఒకసారైనా ఇంటికి రావడం లేదు. మాకు ఈ రికార్డు పర్మిషన్లు అలాంటివి ఏమీ వద్దు. మాకు ఏక్ పోలీస్ కావాలి. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులో ఉన్నట్లు ఇక్కడ మా వాళ్లకు అవే రూల్స్ ఉండాలని కోరుతున్నాం.

**- అన్నం కావ్య, కానిస్టేబుల్ భార్య, గుడిపేట 13వ బెటాలియన్**



ఫ్లైఓవర్ నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ తీస్తున్న కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు



చంటి పాపతో వచ్చిన కానిస్టేబుల్ భార్య

**గుడిపేట 13వ బెటాలియన్ కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యుల రాస్తారోకో**

# టీజీఎస్పీ హటావో.. ఏక్ పోలీస్ బనావో..

- నిర్బంధించేందుకు పోలీసుల యత్నం
- తప్పించుకుని వచ్చి మంచిర్యాలలో నిరసన

మంచిర్యాల, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని బెటాలియన్ పోలీసులు డిమాండ్ చేశారు. 'టీజీఎస్పీ హటావో.. ఏక్ పోలీస్ బనావో..'' నినాదంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుడిపేట 13వ బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు శనివారం రాస్తారోకో చేశారు. ఒకే పోలీస్ వ్యవస్థ అమలు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ రోడ్డుపైనే భీష్మించుకొని కూర్చున్నారు. అంతకుముందు గుడిపేటలోని బెటాలియన్ మెయిన్ బిల్డింగ్ ఎదుట 'వీ వాంట్ జస్టిస్' అంటూ నిరసన తెలిపారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి వచ్చేందుకు సిద్ధమైన వారిని పోలీసులు అడ్డుకున్నారు. బెటాలియన్ ముందు గేట్లు వేసి బయటికి రాకుండా చూశారు. అయినా అక్కడి నుంచి తప్పించుకుని వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల పోలీసులు స్థానిక ఐబీ చౌరస్తాలో మోహరించారు. ఈ విషయం తెలుసుకొని బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు ఫ్లైఓవర్‌పైనే బైఠాయించి రాస్తారోకో చేశారు. దీంతో పోలీసులతో ఏసీపీ ప్రకాశ్ చేరుకొని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా వారు వినకుండా 40 నిమిషాలు రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లు మాట్లాడుతూ బెటాలియన్‌లో తమ చేత గడ్డి చెక్కించడం, కాలువలు తీయించడం, గోడలు కట్టించడం మొదలైన పనులు చేపిస్తున్నారంటూ వాపోయారు. కుటుంబాలకు దూరంగా నెలల తరబడి విధులు నిర్వహిస్తున్నామని, ఈ రోజు ఇక్కడ పని చేస్తే రేపు ఎక్కడ పని చేస్తామో తెలియని దుస్థితిలో ఉన్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏక్ పోలీస్ అమలు చేయాలని, అప్పటి వరకు తమను సీపీకి అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. నినాదాలతో కాసేపు హోరెత్తించారు. చిన్న పిల్లలతో సహా వచ్చిన కానిస్టేబుళ్ల భార్యలు ఎండను సైతం లెక్కచేయకుండా రాస్తారోకోలో కూర్చున్నారు. ఈ క్రమంలో ఏసీపీతో బెటాలియన్ కానిస్టేబుళ్లకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. కాసేపటికి బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు ఫ్లైఓవర్ నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ తీసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.




### ❖ మినిమం ఐదేళ్ల పోస్టింగ్ ఇవ్వాలి

బెటాలియన్ కానిస్టేబుళ్లకు మినిమం ఐదేళ్లు ఒకే దగ్గర ట్రాన్స్‌ఫర్స్ లేకుండా పోస్టింగ్ ఇవ్వాలి. ఇప్పుడు మూడు నెలలు ఇక్కడ పని చేస్తే, ఆ తరువాత మూడు నెలలు ఎక్కడ పని చేస్తారో తెలియని పరిస్థితి ఉంది. నెలలో నాలుగైదు రోజులే ఇంటి వద్ద ఉంటున్నారు. మిగతా రోజులు వాళ్ల కోసం మేం ఎదురు చూస్తూ పడరాని అవస్థలు పడుతున్నాం. నిత్యం ట్రాన్స్‌ఫర్లతో కానిస్టేబుళ్ల పిల్లల చదువులు సైతం ఆగమైతున్నాయి. మాకు న్యాయం చేసేలా ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలి.

**- రత్నం భువన, కానిస్టేబుల్ భార్య, గుడిపేట 13వ బెటాలియన్**

# ప్రజలకు సత్వర న్యాయ సేవలందించాలి



జడ్జి కోర్టు నివాస భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వేణుగోపాల్

బెల్లంపల్లి, అక్టోబర్ 26 : ప్రజలకు సత్వర న్యాయ సేవలందించేలా చర్యలు తీసుకోవాలని జడ్జిలు, న్యాయవాదులు, అధికారులకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ సూచించారు. బెల్లంపల్లి మండలంలోని కన్నాల జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నివాస భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. అంతకుముందు బెల్లంపల్లి సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ మోతీలాల్ ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాలు అందించారు. గుస్సాడీ నృత్యాలతో కళాకారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, బెల్లంపల్లి, మందమర్రి, తాండూర్ సీఐలు అఫ్జలుద్దీన్, శశిధర్ రెడ్డి, కుమారస్వామి, తహసీల్దార్ జ్యోత్స్న, ఎస్ఐలు ప్రవీణ ఆంజనేయులు ప్రసాద్, రమేశ్, సీనియర్ న్యాయవాదులు గోపీ కిషన్ సింగ్, ఎం.శ్రీనివాస్, కోట మల్లయ్య, ఎం.రవీందర్‌రావు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

### జిల్లా కోర్టు సందర్శన

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 26: తెలంగాణ హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్ శనివారం మంచిర్యాల జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి బోయ శ్రీనివాస్, జిల్లా జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం కోర్టులో జిల్లా జడ్జితో పాటు అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు.



పద్మశ్రీ కనక రాజు

# ఇక సెలవు..

- నివాళులర్పించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు
- వందలాదిగా తరలివచ్చిన ఆదివాసులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ) : ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన పద్మశ్రీ కనక రాజు శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కనక రాజు అంత్యక్రియలు అతని స్వగ్రామమైన జైనూర్ మండలంలోని మార్లవాయిలో శనివారం జరిగాయి. ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించగా.. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొని నివాళులర్పించారు. ఆదివాసీలకు ప్రత్యేకమైన గుస్సాడీ నృత్య ప్రత్యేకతను దేశవ్యాప్తంగా ప్రచారం చేయడంతోపాటు సంస్కృతీ అభివృద్ధికి కృషి చేసినందుకు కేంద్ర ప్రభుత్వం విశిష్ట పురస్కారమైన పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. తమ జాతికే గర్వకారణంగా నిలిచిన కనక రాజుకు ఆదివాసులు సంప్రదాయబద్ధంగా వీడ్కోలు పలికారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివాసులు తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించి, గాలిలోకి కాల్పులు జరిపారు.

### కనక రాజు సేవలు అనిర్వచనీయం..

ఆదివాసుల సంస్కృతిని కాపాడుతూ ప్రపంచానికి చాటిచెప్పిన కనక రాజు తమ జాతికి చేసిన సేవలు అనిర్వచనీయమైనవని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గుస్సాడీ నృత్యాన్ని అభివృద్ధి చేసి భావితరాలకు అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించిందన్నారు. మారుమూల గ్రామమైన మార్లవాయి ప్రాంతానికి చెందిన ఆదివాసీకి పద్మశ్రీ లభించడం గర్వకారణమన్నారు. మార్లవాయిలో నృత్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువకులకు తమ ఆచారాలను నేర్పించారని అన్నారు. ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలకు పేరు తీసుకొచ్చిన ఆయన మరణం తీరని లోటని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గుస్సాడీ పేరు వింటేనే గుర్తుకొచ్చే కనక రాజు తమ ఆచారాలను భావి తరాలకు అందించేందుకు తన జీవితాన్ని ధారపోశారని అన్నారు. పద్మశ్రీ పురస్కారాన్ని పొందిన కనక రాజు ఆదివాసీ జాతికే ఆణిముత్యం అని పేర్కొన్నారు. ఆయన సేవలను జాతి మరచిపోదన్నారు. కనక రాజు అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్, నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సార్‌మేడీలు, రాయిసెంటర్ల ప్రతినిధులు, హేమన్ డార్ఫ్ ఆదివాసీ యువకులు, ఆదివాసీ గ్రామాల పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కనక రాజు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



అధికారిక లాంఛనాల్లో భాగంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

# వైభవంగా దండారీ సంబురాలు

- పద్మల్‌పురి కాకో అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న గుస్సాడీల నృత్యాలు

దండేపల్లి, అక్టోబర్ 26: దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరంలోని ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం పద్మల్‌పురి కాకో ఆలయంలో దండారీ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. మహారాష్ట్ర, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనులు, మహిళలు సుమారు వెయ్యి మందికి పైగా తరలివచ్చి ముందుగా గోదావరి నదిలో స్నానాలు చేశారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, కోళ్లు మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా 'రేలా...రేలా..' పాటలతో నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపి, కళ్లద్దాలు, భుజాన జింక తోలు, నడుముకు, కాళ్లకు గజ్జెలు ధరించి, చేతిలో కోలా పట్టుకొని తప్పెట గూళ్ల వాయిద్యాలకు, డప్పు చప్పుళ్లతో కళాకారులు చేసిన గుస్సాడీ నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈనెల 28న గుస్సాడీ దర్బార్ నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

### అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

పద్మల్‌పురి కాకో అమ్మవారిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాభివృద్ధికి రూ.36లక్షలు కేటాయించామని గుర్తు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, మాజీ వైస్ ఎంపీపీ అనిల్, నాయకులు ఉన్నారు. సీఐ నరేందర్, ఎస్ఐ ఉదయ్‌కిరణ్ అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయం వద్ద గుస్సాడీలు

# పెద్దపులి సంచారం

హాజీపూర్, అక్టోబర్ 26 : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. శనివారం హాజీపూర్ మండలంలోని ధర్మారం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు నిర్ధారించారు. ధర్మారం నుంచి బుగ్గగట్టు, గుడిపేట, ర్యాలీ ప్రాజెక్టు వెళ్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సాయంత్రం సమీప గ్రామాల్లో డప్పు చాటింపు వేయించినట్లు గుడిపేట ఫారెస్ట్ సెక్షన్ బీట్ ఆఫీసర్ రాజేందర్ తెలిపారు. మేత కోసం పశువులను అడవికి పంపించవద్దని, వంట చెరుకు కోసం ఎవరూ అడవికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తే కఠిన చర్యలు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు
- మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

మంచిర్యాల, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అనుమతులు లేని లే-అవుట్‌లలోని ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు స్పష్టం చేశారు. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసేందుకు మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ సిద్ధమయ్యారనే ఆరోపణలు కొన్ని రోజులుగా వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మంచిర్యాల కార్యాలయం నుంచి ఇప్పటి వరకు చేసిన రిజిస్ట్రేషన్ల డేటా మొత్తం తీసుకెళ్తున్నట్లు రవీందర్‌రావు తెలిపారు. ఇందులో ఏ ఒక్క డాక్యుమెంట్ వాయిలేషన్ జరిగినట్లు తేలినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అక్రమాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఇక నుంచి నెలకు ఒకసారైనా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ను తనిఖీ చేస్తానని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్లు చేసే డాక్యుమెంట్‌లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.



మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు

# ఈఎస్ఐ దవాఖానలో విచారణ

కాగజ్‌నగర్, అక్టోబర్ 26 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ దవాఖానలో వరంగల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హేమలత శనివారం తనిఖీలు నిర్వహించారు. కాగజ్‌నగర్ ఈఎస్ఐ దవాఖానకు చెందిన మందులను కరీంనగర్‌లో ఓ ఫార్మసిస్టు విక్రయిస్తూ పట్టుబడిన కేసు విషయమై విచారణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. మందుల నిల్వ, వినియోగం, రికార్డులు తదితర వివరాలు సేకరించి ఆ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఈఎస్ఐ దవాఖాన సూపరింటెండెంట్ జగన్, ఈఎస్ఐ వైద్య సిబ్బంది ఉన్నారు.


### పాత భవనంలో వృథాగా మందులు..

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ దవాఖాన వెనుక భాగంలోని పాడుబడ్డ భవనంలో లక్షల రూపాయల విలువ చేసే మందులు వృథాగా ఉన్నాయి. 2020 సంవత్సరానికి కాలపరిమితి ముగిసిన ఈఎస్ఐకి చెందిన మందుల కాటన్లు ఉన్నాయి. ఈ విషయమై జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హేమలత దృష్టికి మీడియా ప్రతినిధులు తీసుకెళ్లారు. అక్కడే ఉన్న స్థానిక సిబ్బంది స్పందించి ఆ మందులు ఈ దవాఖానకు సంబంధించినవి కావని చెప్పడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈఎస్ఐకి చెందిన లక్షల రూపాయల మందులు వినియోగించకుండా వృథా చేశారని విమర్శలు వస్తున్నాయి.




ఈఎస్ఐ దవాఖానను తనిఖీ చేస్తున్న వరంగల్ జేడీ హేమలత

# ప్రాణహితలో ముగ్గురు యువకుల గల్లంతు



హుస్సేన్



ఇర్షాద్



మోహిజ్

బెజ్జూర్, అక్టోబర్ 26 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని గోల్కొండ ప్రాంతానికి చెందిన ముగ్గురు యువకులు మండలంలోని ఎర్రబండ వద్ద ప్రాణహిత నదిలో ఈతకు వెళ్లి గల్లంతైన ఘటన శనివారం జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..బెజ్జూర్‌కు చెందిన జహీర్ హుస్సేన్(23), ఇర్షాద్ (20), మోహిజ్(19) శనివారం షాపులు బంద్ ఉండడంతో మండలంలోని ఎర్రబండ వద్ద ప్రాణహిత నది వద్దకు ఈతకు వెళ్లారు. నదిలో స్నానాలు చేశారు. కొద్ది సేపటి తర్వాత నదిలోని మడుగులో ఈత కోసం వెళ్లారు. అది లోతు ఎక్కువగా ఉండడంతో ఒక్కొక్కరుగా మునిగిపోయారు. వీరితో పాటు వచ్చిన మరో మిత్రుడు ఖాజీం ఒడ్డున ఉండి కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు వచ్చి వెతికినా దొరకలేదు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ విక్రమ్, ఆర్ఐ సంతోష్, సిబ్బందితో వచ్చి గజ ఈతగాళ్ల రాత్రి 10 గంటల వరకు వెతికినా ఆచూకీ దొరకలేదు.



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు